క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన బొల్లపెల్లి వజ్రమ్మ, కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన అరూరి లక్ష్మి, పైండ్ల రాజు, రాంనగర్ గ్రామానికి చెందిన ఆకులపెల్లి ప్రమీల, నందనం గ్రామానికి చెందిన కన్న శ్రీజ ఇటీవల మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. నందనం గ్రామానికి చెందిన బుర్ర కొమురయ్య ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడటంతో ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ ఉస్మాన్ అలీ, మండల పార్టీ నాయకులు పోలెపల్లి శంకర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, మిద్దెపాక రవీందర్, మండల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

నర్సక్కపల్లెలో 'నాగుర్ల'..



నడికూడ: మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన పెద్ద సాంబయ్య ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు గురువారం పరామర్శించారు. అలాగే, బీఆర్ఎస్ నాయకుడు పాడి ప్రతాపరెడ్డి ఇటీవల వడదెబ్బకు గురై అనారోగ్యానికి గురికాగా, ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, ఆరె సంఘం జిల్లా కార్యదర్శి నాగుర్ల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో పలువురికి..

శాయంపేట: మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఎండీ.మహబూబ్ పాషా, మండల కేంద్రానికి చెందిన బత్తుల కమలాకర్, బత్తిని సరోజన, కూతాటి ఎల్లమ్మ, పైడిమల్ల కమలమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు గురువారం పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



శాయంపేట: శాయంపేట మండల కేంద్రానికి చెందిన బత్తుల కమలాకర్, పైడిమల్ల కమలమ్మ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను శాయంపేట ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ గురువారం పరామర్శించి రూ.8 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాడిశెట్టి గణేష్, బత్తుల కార్తీక్, దైనంపల్లి కరణ్‌బాబు, దైనంపల్లి పాపయ్య, మారెపల్లి మోహన్, గాదె రాజేందర్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



ఐనవోలు: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని లింగమోరిగూడెం గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుడు లింగం ఉపేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ క్షేత్రం వద్ద ముర్ర జాతి గేదె మేస్తోంది. స్తంభం నుంచి స్టాటర్‌కు వచ్చే కనెక్షన్ విద్యుత్ వైర్ కిందపడటంతో దాన్ని తొక్కిన గేదె.. విద్యుదాతానికి గురై మృతిచెందిందని తెలిపారు. గేదె విలువ సుమారు రూ.75 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట మెయిన్ రోడ్డు, సెయింట్ థామస్ స్కూల్ వీధి, ఉప్పలయ్య హోటల్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కార్మికుల ఐక్యతను సాధించాలి

కరీమాబాద్: కార్మికుల ఐక్యతను సాధించాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి సూచించారు. ఉర్సుగుట్ట ఆర్ఎస్ భవన్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాధవి పాల్గొని మాట్లాడారు.

మోడల్ కాలేజీ దిశగా ధర్మసాగర్ కళాశాల

- ప్రిన్సిపాల్ వినూత్న ప్రచారం
- మన మండలం – మన కళాశాల నినాదంతో ముందుకు..



ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల



ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మసాగర్: ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నమూనా కళాశాల వైపుగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. మన మండలం – మన కళాశాల నినాదంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశం కోసం వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమ కాలంలో అప్పటి కాలంలో మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి 2000వ సంవత్సరంలో ధర్మసాగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థాపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 4వేల మంది విద్యార్థులు ఈ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారు. తెలంగాణలో ఎన్‌సీసీ ఉన్న ఏకైక కళాశాల కావడంతో శిక్షణ పూర్తి చేసిన కేడెట్లు వంద మందికి పైగా భారత రక్షణ రంగంలో వివిధ ఉద్యోగాలను సంపాదించారు. కాలక్రమేణా నిర్లక్ష్యానికి గురైన కళాశాలకు పూర్వ వైభవం తేవడానికి ప్రస్తుత ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ సారథ్యంలో తీవ్రమైన కృషి జరుగుతోంది. తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఉన్నత విద్య ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహకారం, మార్గదర్శనం అందిస్తామని ఆయన తెలియజేస్తున్నారు. కడియం ఫౌండేషన్, అవేలి కంపెనీ గ్రూప్స్, జాతీయ సాంకేతిక విద్యా సంస్థ వరంగల్, దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సన్‌రైజర్స్ క్లబ్ వికాస తరంగిణి, కాసం సేవా సంస్థ, దళిత్ విమెన్ కలెక్టివ్ వంటి సేవా సంస్థలు విద్యార్థుల విద్య అవసరాలను తీర్చడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఆ సంస్థలు ధర్మసాగర్ కళాశాలకు చేయూత ఇవ్వడానికి ఒప్పించడంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కీలకపాత్ర పోషించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కళాశాలలో సౌకర్యాల కల్పనకు ఇప్పటికే ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీడీసీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు. స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రూ.10 లక్షలు ప్రకటించారు. అదేవిధంగా ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, నర్సిరెడ్డి ఈ సంవత్సరం సీడీసీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించి కళాశాలను నమూనాగా మార్చడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సామాజిక బాధ్యతతో వృత్తి ధర్మం నిర్వర్తించి, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ, సామాజిక కార్యశీలి పురస్కారం పొందిన ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ సారథ్యంలో సేవలందించడానికి రెగ్యులర్ అధ్యాపక బృందం సిద్ధంగా ఉంది.

బ్యూటీషియన్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు: బ్యూటీషియన్ ఉచిత శిక్షణ తరగతులను అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ సహకారంతో బ్యూటీషియన్ కోర్సును గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ మహిళలు, యువతులు స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణతో ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ ద్వారా మహిళలకు కుట్టు మిషన్, బ్యూటీషియన్‌తో పాటు పలు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. డీఆర్‌డీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు, యువత ఉచిత బ్యూటీషియన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సుకినె సంతాజీ గురువారం తెలిపారు. సమావేశంలో కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్‌గౌడ్, పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి హాజరు కానున్నట్లు వివరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయభేరి మోగించిన సందర్భంగా అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని సంతాజీ కోరారు.

ధ్వజస్తంభ పునర్నిర్మాణానికి నిధులు కేటాయిస్తా



ఆలయాన్ని పరిశీలిస్తున్న మధుసూదనాచారి

శాయంపేట: మండలంలోని కొప్పుల గ్రామంలోని మహదేవ సాంబశివ దేవాలయంలో ధ్వజస్తంభం పునర్‌నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకు కొప్పుల గ్రామంలోని దేవాలయంలో ధ్వజస్తంభం విరిగి కింద పడిపోయింది. ఈమేరకు ఎమ్మెల్సీ మధుసూదనాచారి గురువారం ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఆలయ పూజారులతో కలిసి జరిగిన నష్టాన్ని అంచన వేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంగల నారాయణరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రమేష్, నాయకులు తోకల సమ్మిరెడ్డి, సామల ధనుజయ తదితరులు ఉన్నారు.

28నుంచి ఉప్పల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

కమలాపూర్: కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో ఈనెల 28నుంచి సీఆర్పీఎఫ్ అమర జవాన్ ర్యాకం శశిధర్ స్మారకార్థం ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయి ఉప్పల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బొమ్మల అమర్‌నాథ్, రాజు, నాగరాజు, శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న ఈ టోర్నీలో పాల్గొనే వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు తీసుకుని రావాలని, రిజిస్ట్రేషన్ చేసుకునే జట్లు రూ.2 వేల ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. విజేత జట్టుకు రూ.50,016, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.25,016 నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు వివరించారు. పూర్తి వివరాలకు 99636 46961, 99089 18399, 77026 82884, 82973 93613 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



ప్రశంసపత్రం అందజేస్తున్న పీఈటీ కరిత

శాయంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు టేబుల్ టెన్నిస్ జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతామహాలక్ష్మి, పీఈటీ కరిత తెలిపారు. టేబుల్ టెన్నిస్ జిల్లా స్థాయి క్రీడలో బి.శరణ్య, పి.శ్వేత, పి.సుస్మిత రాణించి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు వివరించారు. జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, ఎంపీడీఓ అమంచ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న నాగరాజు

దామెర: ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అంబుడ్స్‌మెన్ నాగరాజు సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్, ఊరుగొండలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు అధిక సంఖ్యలో హాజరు కావాలని అన్నారు. పనులు జరుగుతున్న స్థలంలో కనీస వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.

నిన్న అకాల వర్షాలు.. నేడు అగ్నిజ్వాలలు

- వారంలో మూడు గ్రామాల్లోని పంటపొలాలు దగ్ధం
- దాచుకున్న ధాన్యం, మొక్కజొన్నలు అగ్గిపాలు
- ఆందోళన చెందుతున్న రైతులు





పైడిపల్లి శివారులో మంటలకు దగ్ధమైన మొక్కజొన్న చేను, కాలిన కంకులను చూపుతున్న రైతు భిక్షపతి

పరకాల: అసలే అకాల వర్షాలతో పంట దెబ్బతిని.. ఎట్లా బతికేది అంటూ ఆందోళన చెందుతున్న రైతులకు వేసవి మంటలు కలవరానికి గురిచేస్తున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్లు, బీడీలు కాల్చిపడేయటంతో పంటపొలాలకు మంట వ్యాపించి చేతికొచ్చిన దిగుబడి బూడిద అవుతోంది. పరకాల మండలం నాగారం గ్రామ శివారులో గురువారం సాయంత్రం పంటపొలాలకు నిప్పు అంటుకుంది. దీంతో మంటలు తీవ్రంగా వ్యాపించటంతో పంటపొలాల మధ్య ధాన్యం కుప్పలు, మొక్కజొన్న కుప్పలు పోసిన రైతులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించిన రైతులు.. మంటలను మిగతా పొలాలకు వ్యాపించకుండా, ధాన్యం కుప్పలకు అంటుకోకుండా శ్రమించారు. అయినప్పటికి పైడిపల్లి గ్రామానికి చెందిన పర్లపల్లి కుమారస్వామికి చెందిన ఎకరం పొలం ధాన్యం దగ్ధమైంది. అంతేకాకుండా నాగారం మాజీ సర్పంచ్ పసుల భిక్షపతికి చెందిన 2 ఎకరాల మొక్కజొన్న మంటలకు ఆహుతైంది. కర్రలన్నీ కాలిపోవడంతో వేలాది రూపాయల నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

కడిపికొండలోని భూమి దళితులదే!



రాస్తారోకో చేస్తున్న వారిని నిలువరిస్తున్న పోలీసులు

కాజీపేట అర్బన్: కడిపికొండ గ్రామంలోని సర్వే నంబర్ 366లోని 32 ఎకరాల పంచరాయి భూమి కడిపికొండకు చెందిన దళితులదేనని 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనిత తెలిపారు. ఈమేరకు బైపాస్ రోడ్డుపై దళితులు గురువారం ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అనిత మాట్లాడుతూ 1994లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం కడిపికొండకు చెందిన 64మంది దళితులకు 32ఎకరాల పంచరాయి భూమిని కేటయించగా, దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ భూమిని టీఎన్జీవోస్ ఉద్యోగులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, నాటి జాయింట్ కలెక్టర్ వాకాటి కరుణ.. లోపాయికారీ ఒప్పందం చేసుకుని అప్పగించారని ఆరోపించారు. కాగా, రాస్తారోకోతో ఖమ్మం బైపాస్ రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో కాజీపేట, మడికొండ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

స్వయం ఉపాధికి బ్యూటీషియన్, టైలరింగ్ దోహదం



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

వరంగల్ చౌరస్తా: మహిళా సాధికారతకు బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. వరంగల్ 27వ డివిజన్ పరిధిలో బాపూజీ విజ్ఞాన కేంద్రంలో శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను గురువారం పంపిణీ చేశారు. సిరి స్వచ్ఛంద సంస్థ, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం సౌజన్యంతో కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సిరి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పరికి సుధాకర్, కార్పొరేటర్ చింతాకుల అనిల్, జయశ్రీ, ఆర్.ధనలక్ష్మి, పోలెపాక లక్ష్మి, ఎల్‌సీపీఓ సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

శాయంపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. శాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల సందర్భంగా అధ్యాపకులు ఫ్లెక్సీలు పట్టుకుని గురువారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి జూనియర్ కళాశాలలో అందిస్తున్న మౌలిక వసతుల గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో విద్యార్థులకు బోధిస్తున్నట్లు వివరించారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు తెలుగు అకాడమీ పుస్తకాలను ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు వివరించారు. కెరియర్ గైడెన్స్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు హిమబిందు, శైలేందర్, వేణు, కల్పన, మల్లికార్జున్, రవీంద్రనాయక్, సునీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణాల్లో పోలీసుల తనిఖీలు



పరకాలలో తనిఖీ చేస్తున్న పోలీసులు



ముల్కనూర్‌లోని దుకాణంలో ఎస్సై..

పరకాల: పరకాల పట్టణంలో కొందరు ఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణాల యజమానులు కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తుండటంతో పరకాల పోలీసులు రోజువారీగా దుకాణాల్లో తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నారు. దాంతో పరకాల పట్టణంలోని ఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణాల యాజమానుల గుండెల్లో రైల్లు పరుగెడుతున్నాయి. వారం రోజుల్లో మూడుసార్లు దాడులు చేసిన పోలీసులు.. ఒక దుకాణంలో కాలం చెల్లిన నాలుగు ప్యాకెట్లు, మరో దుకాణంలో రూ.70 వేల విలువ చేసే కాలం చెల్లిన విత్తనాల ప్యాకెట్లు, ఎరువులను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరకాల సీఐ పుల్యాల కిషన్, వ్యవసాయాధికారి శ్రీనివాస్ సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు సరుకులపై ఉన్న గుర్తులను పరిశీలించారు. దుకాణాల్లో సాయంత్రం వరకు పోలీసులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో పరకాల ఎస్సై ప్రశాంత్‌బాబు, పోలీసు సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్

ఎల్కతుర్తి: నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టినట్లు తెలిస్తే సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులతో పాటు పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై మహేందర్ హెచ్చరించారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని విత్తనాలు, ఎరువులు క్రిమిసంహార మందుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలు, రికార్డులను ఎస్సై పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఏది కొనుగోలు చేసినా రైతులు తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు.

ధాన్యం తరలించాలని రైతుల నిరసన



పసరగొండలో ఆందోళన చేస్తున్న రైతులు

దామెర: మండలంలోని సింగరాజుపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని తరలించడంలో నిర్వాహకులు ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. కాంటాలు పూర్తైనప్పటికీ కాంట్రాక్టర్ వాహనాలు సమకూర్చడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుల తరబడి రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకొని కొనుగోలు కేంద్రంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పరకాల జిల్లా కోసం ఫ్లెక్సీల ఏర్పాటు

- ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్న బీజేపీ



పరకాల: పరకాలను అమరవీరుల జిల్లా చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు రోజు రోజుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. జిల్లా సాధన కమిటీని ఏర్పాటు చేసిన బీజేపీ ఇప్పటికే ప్రజాసంఘాల మద్దతు పొందుతోంది. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు దశలవారీ పోరాటాలకు సిద్ధమని బీజేపీ నాయకులు చెప్పారు. ప్రభుత్వంపై స్థానిక ఎమ్మెల్యే చలా ధర్మారెడ్డి ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు. పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించాలని కోరుతూ పరకాల బస్టాండ్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా, ఎన్నికల ముందు పరకాల జిల్లా పోరాటం తెరమీదికి తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది.

నిప్పంటుకుని మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమవుతున్న మొక్కజొన్న చేను

కమలాపూర్: కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెం శివారులో గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పలువురు రైతులకు చెందిన మొక్కజొన్న పంటలు దగ్ధమయ్యాయి. బాధిత రైతుల కథనం మేరకు గురువారం మధ్యాహ్నం సమయంలో మొక్కజొన్న పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. గమనించిన రైతులు అగ్నిమాపక సిబ్బందితో పాటు స్థానిక సర్పంచ్‌కు సమాచారం అందించారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని రైతులతో కలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. ఇంతలోనే కరీంనగర్ జిల్లా జమ్మికుంట నుంచి అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో వచ్చి మంటలు ఆర్పివేశారు. కాగా, అప్పటికే ఎరుకల దామోదర్, కదురు తిరుపతి, ఎరుకల రాజయ్య, కూన జయపాల్ అనే నలుగురు రైతులకు చెందిన సుమారు ఆరు ఎకరాల్లోని మొక్కజొన్న కంకులు మంటల్లో కాలి దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు దగ్ధమైన మొక్కజొన్న చేలను పరిశీలించి వివరాలు సేకరించారు.

బస్తీ పిల్లలకు సమ్మర్ క్యాంపు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్లు

హన్మకొండ అర్బన్: నిరుపేద పిల్లల్లో సృజనాత్మక పెంపొందించేందుకు విద్యా వికాస ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని అంబేడ్కర్ బస్తీలోని పిల్లలకు గురువారం సమ్మర్ క్యాంపు ప్రారంభించినట్లు వరంగల్ ఆర్ట్ సొసైటీ సభ్యులు, డ్రాయింగ్ మాస్టర్ సుధాకర్, క్రాఫ్ట్ మాస్టర్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్తీ పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించేదుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. అనంతరం పిల్లలకు డ్రాయింగ్, క్రాఫ్ట్ పరికరాలను అందించారు. ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు, వరంగల్ ఆర్ట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.